సాక్షి జగిత్యాల

శుక్రవారం । 29 । నవంబర్ । 2024

గోదావరికి గంగా హారతి



ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురిలోని గోదావరి వద్ద కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని నదిలో దీపాలు వదిలారు.

న్యూస్‌రీల్

డిజిటల్ ల్యాండ్ రికార్డులకు ఏర్పాట్లు చేయండి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: డిజిటల్ ల్యాండ్ రికార్డుల నమోదుకు దేశంలోని వంద పట్టణాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామని, ఆ పట్టణాల్లో కార్యాచరణ కట్టుదిట్టంగా అమలు చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ మనోజ్ జోషి అన్నారు. గురువారం నేషనల్ జియో స్పెషియల్ నాలెడ్జ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్ష)పై జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భూ రికార్డులను డిజిటలైజ్ చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో కొన్ని పట్టణాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిందని, అందులో జగిత్యాల కూడా ఉందని పేర్కొన్నారు. నక్ష అమలుకు నోడల్ అధికారులను నియమించాలని, మ్యాన్‌పవర్, కార్యాలయాలు, సామగ్రి సమకూర్చాలని సూచించారు. అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో భూ రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని, జిల్లాకేంద్రం, గ్రామాల్లో భూ రికార్డులకు సంబంధించి రీసర్వే వివరాలను డిజిటలైజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న ముసిపట్ల లక్ష్మీనారాయణ

జగిత్యాలటౌన్: పేదల హక్కుల కోసం సామాజిక పోరాటం చేసిన మహాత్మ పూలే స్ఫూర్తితో ముందుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే పోరాట ఫలితంగానే బడుగు, బలహీనవర్గాలు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించడంతోపాటు హక్కులు పొందగలుగుతున్నారని అన్నారు. పూలే ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. నాయకులు తిరుపురం రాంచందర్, బొమ్మిడి నరేష్‌కుమార్, బండపెల్లి మల్లేశ్వరి, రాపర్తి రవి, హృషికేష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాజోజి ముఖేష్‌ఖన్నా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఆర్టీసీలో వనభోజనాలు



అన్నం వడ్డిస్తున్న జగిత్యాల డీఎం సునీత

జగిత్యాలటౌన్/కోరుట్ల: జిల్లాలోని ఆర్టీసీ సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కార్తీక వనభోజనాలకు వెళ్లారు. జగిత్యాల, కోరుట్ల డిపో మేనేజర్లు సునీత, మనోహర్ ఆధ్వర్యంలో ఆటాపాటలతో ఉల్లాసంగా గడిపారు. మేనేజర్లు కార్మికులతో కలిసి భోజనాలు చేశారు. కార్మికులు, సిబ్బంది విధుల్లో ఎదుర్కొనే ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. జగిత్యాల ట్రాఫిక్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ జగదీశ్వరీ, మెయింటెనెన్స్ ఇన్‌చార్జి విజయ్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ శేఖర్, కోరుట్లలో అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో రాము

జగిత్యాల: పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని డీఈవో కె.రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో గురువారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. వందశాతం ఉత్తీర్ణతకు ఇప్పటినుంచే ప్రణాళిక రూపొందించాలని, ఆమేరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. డిసెంబర్ 4న నిర్వహించే నాస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. సెక్టోరియల్ అధికారులు కొక్కుల రాజేశ్, సత్యనారాయణ, మహేశ్, మురళీమోహన్‌చారి పాల్గొన్నారు.

అల్లునూర్ చౌరస్తా

తెలంగాణ ఉద్యమానికి మలుపు



2009 నవంబర్ 29న కేసీఆర్‌ను అరెస్టు చేస్తున్న సమయంలో కిక్కిరిసిన అల్లునూర్ చౌరస్తా

- తెలంగాణ చారిత్రక ఘట్టానికి కరీంనగర్ వేదిక
- ఉద్యమ నేత కేసీఆర్ అరెస్ట్.. ఎగిసిపడ్డ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం
- ఫలితమే డిసెంబర్ 9 ప్రకటన.. నేడు అల్లునూర్‌లో దీక్షా దివస్
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక

కరీంనగర్ ✍:

నవంబర్ 29.. ఈ తేదీ తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలకమైనది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రోజు. తనకు కలిసొచ్చిన కరీంనగర్ వేదికగా కేసీఆర్ దీక్ష ప్రకటనతో పడిన అడుగు తెలంగాణ రాష్ట్ర సాధనకు వరకు సాగింది. ఏటా నవంబర్ 29న బీఆర్‌ఎస్ పార్టీ దీక్షా దివస్ వేడుకలు నిర్వహిస్తోంది. పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత మొదటిసారిగా వచ్చిన దీక్షా దివస్‌ను గులాబీ బాస్ అరెస్టయిన కరీంనగర్ పరిధిలోని అల్లునూర్ వేదికగా నిర్వహించనున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నాటి తెలంగాణ ఉద్యమ ఘట్టాలను మరోసారి మననం చేసుకుందాం.

చావుదెబ్బ నుంచి సంచలన ప్రకటన..

2009లో మహాకూటమిని భంగపరుస్తూ మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూటమితో జతకట్టిన టీఆర్‌ఎస్ చావుదెబ్బ తింది. తెలంగాణ అంతటా పట్టుమని 10 సీట్లు రాని పరిస్థితి. 4 సీట్లను అందించి, కరీంనగర్ కాస్త పరువు నిలబెట్టింది. ఓటమి భారాన్ని తట్టుకోలేకపోయిన కేసీఆర్ కార్యకర్తలకు, మీడియాకు దూరంగా ఉంటూ వచ్చారు. కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్‌లో వారం రోజులు విశ్రాంతి తీసుకున్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్.రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో రోశయ్య సీఎం అయ్యారు. అప్పటివరకు ముఖం చాటేసిన కేసీఆర్ తిరిగి తెలంగాణ ఉద్యమంపై దృష్టిసారించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఉత్తర తెలంగాణ భవన్‌లో మేధోమథనం చేశారు. అందులో నుంచి పుట్టిందే ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష. దీనికి ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థులు మద్దతు తెలిపారు.

అల్లునూర్ చౌరస్తాలో అదుపులోకి..

2009 నవంబర్ 29వ తేదీ ఉదయం 7.30 గంటలకు కరీంనగర్‌లోని తెలంగాణ భవన్ నుంచి కేసీఆర్ సిద్దిపేటకు బయలుదేరారు. ఆయన వెంట టీఆర్‌ఎస్ సిద్ధాంతకర్త దివంగత ప్రొఫెసర్ జయశంకర్, నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఉన్నారు. పోలీసులు పక్కా వ్యూహంతో కాన్వాయ్‌ను అల్లునూరు బ్రిడ్జి వద్ద నిలిపివేశారు. నాటకీయ పరిణామాల మధ్య స్థానిక చౌరస్తాలో కేసీఆర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తన అరెస్టుకు నిరసనగా ఆయన అక్కడే రోడ్డుపై బైఠాయించారు. కార్యకర్తలు పోలీసుల వాహనాల టైర్లలో గాలి తీశారు. దీంతో పోలీసులు కేసీఆర్‌ను మరో వాహనంలో హుజూరాబాద్, వరంగల్ మీదుగా ఖమ్మం తరలించారు. మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించడంతో ఖమ్మం జైలుకు తరలించగా, కేసీఆర్ అక్కడే ఆమరణ దీక్ష ప్రారంభించారు.



అల్లునూర్‌లో బైఠాయించిన కేసీఆర్, నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు (ఫైల్)



కేసీఆర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)

భగ్గుమన్న తెలంగాణ..

కేసీఆర్ అరెస్ట్‌తో తెలంగాణ భగ్గుమంది. ఉస్మానియా యూనివర్సిటీలో శ్రీకాంతాచారి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు రోజుల్లోనే ఖమ్మం ఆస్పత్రిలో కేసీఆర్ దీక్ష విరమించినట్లు మీడియాలో కథనాలు రావడంతో ఉద్యమకారులు తిరగబడ్డారు. తాను దీక్ష విరమించలేదంటూ ప్రాణం పోయేంతవరకు కొనసాగిస్తానని కేసీఆర్ ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్యం క్షీణిస్తుండటం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

డిసెంబర్ 9న ప్రకటన..

కేసీఆర్ దీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం డిసెంబర్ 9, 2009 అర్ధరాత్రి ప్రకటన చేశారు. దీంతో తెలంగాణ అంతటా సంబరాలు మిన్నంటాయి. కేసీఆర్ దీక్ష విరమించారు. అనంతరం సీమాంధ్రలో సమైక్యాంధ్ర కోసం ఉద్యమాలు మొదలవడంతో 23న కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కేంద్రం మాట తప్పడంపై తెలంగాణవాసులు మండిపడ్డారు. జేఏసీ ఏర్పడటం, 24న ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా రాజీనామా చేయడం జరిగిపోయాయి. తెలంగాణ వస్తుందన్న భావన బలపడటం మొదటలు రాష్ట్రం ఆవిర్భావం వరకు సబ్బండ వర్గాలు ఉద్యమించాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచి, కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేశారు.



దీక్షకు ముందు, తర్వాత

- **నవంబర్ 6 :** తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేస్తానని కేసీఆర్ ప్రకటన.
- **నవంబర్ 16 :** సిద్దిపేటలో 29న దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడి.
- **నవంబర్ 26 :** దీక్షకు ముందు విశ్రాంతి తీసుకునేందుకు కరీంనగర్‌లోని తెలంగాణ భవన్‌కు కేసీఆర్. 144 సెక్షన్ విధింపు.
- **నవంబర్ 28:** తెలంగాణ భవన్ చుట్టూ మోహరించిన పోలీసులు, కేసీఆర్ గృహ నిర్బంధమంటూ అర్ధరాత్రి మీడియాలో కథనాలు.
- **నవంబర్ 29 :** దీక్షకు బయలుదేరిన కేసీఆర్‌ను అల్లునూర్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు. ఖమ్మం జైలుకు తరలింపు. జైలులోనే కేసీఆర్ దీక్ష ప్రారంభం.
- **నవంబర్ 30 :** ఖమ్మం ఆస్పత్రిలో కేసీఆర్ దీక్ష విరమించారంటూ కథనాలు. కొనసాగిస్తున్నట్లు అర్ధరాత్రి కేసీఆర్ ప్రకటన.
- **డిసెంబర్ 3 :** తెల్లవారుజామున ఖమ్మం ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు కేసీఆర్ తరలింపు.
- **డిసెంబర్ 9 :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రకటన. కేసీఆర్ దీక్ష విరమణ.
- **డిసెంబర్ 10 :** తెలంగాణ ప్రకటనకు నిరసనగా సీమాంధ్రలో ఎమ్మెల్యేల రాజీనామా.
- **డిసెంబర్ 11 :** నిమ్స్ నుంచి కేసీఆర్ డిశ్చార్జి
- **డిసెంబర్ 17 :** ఉస్మానియా విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలంటూ సీఎం కార్యాలయం ఎదుట ఈటల రాజేందర్, హరీశ్‌రావు ధర్నా.
- **డిసెంబర్ 23 :** చిదంబరం రెండో ప్రకటన. పార్టీలు మాట మార్చాయని వెల్లడి.
- **డిసెంబర్ 24 :** తెలంగాణలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధుల రాజీనామా.

దీక్షా దివస్ సక్సెస్ చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తిమ్మాపూర్: స్వరాష్ట్ర సాధనకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నవంబర్ 29న ఆమరణ దీక్ష చేపట్టారని, ఆయన దీక్షతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. అల్లునూర్‌లో చేపట్టిన ఆమరణ దీక్షకు 15ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాని కోరారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు ఎల్‌ఎండీలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించి, ర్యాలీగా వెళ్లి అల్లునూర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సతీశ్‌బాబు, మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.

బాల్యం.. బలహీనం

- పిల్లల్లో ఆందోళన కలిగిస్తున్న పౌష్టికాహార లోపం
- తక్కువ బరువుతో తరచూ అనారోగ్యం
- ఫలితమివ్వని అవగాహన కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లాలో చిన్నారుల పరిస్థితి
- స్పందించాలంటున్న పేరెంట్స్



రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన ఈ చిన్నారి వయస్సు 40 నెలలు. 95–102 సెం.మీ. ఎత్తు, 13–16 కేజీల బరువు ఉండాలి. కానీ, 9.2 కేజీల బరువు, 85 సెం.మీ. ఎత్తు మాత్రమే ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి చిన్నారులు ఎంతోమంది ఉన్నారు.

సాక్షి,పెద్దపల్లి/జగిత్యాల:

తీవ్ర పోషకాహార లోపం, అతి తక్కువ బరువు, వయసుకు తగిన ఎత్తు లేకపోవడం తదితర కారణాలతో ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది చిన్నారులు(ముఖ్యంగా పేద, మధ్యతరగతివారు) తరచూ అనా రోగ్యానికి గురవుతున్నారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లల్లో వయసు పెరిగే కొద్దీ సమస్యలు రెట్టింపవుతున్నా యి. ఐదేళ్ల లోపు చిన్నారులను రక్తహీనత వెంటాడుతోంది. ఫలితంగా వారిలో ఉత్సాహం కనిపించడం లేదు. తోటి పిల్లలతో ఆడుకోలేకపోతున్నారు. ఇలాంటి వారి ని గుర్తించి, పౌష్టికాహారం అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలున్నాయి.

బాలామృతం, కోడిగుడ్లు ఇంటికే

మూడేళ్లలోపు పిల్లలకు జాతీయ పౌష్టికాహార సంస్థ సూచించిన మా ర్గదర్శకాల మేరకు బాలామృతం, నెలకు 16 గుడ్లు ఇస్తున్నారు. 3–6 ఏళ్లలోపు చిన్నారులకు భోజనం, స్నాక్స్, పాలు, రోజుకొకటి చొ ప్పున నెలకు 30 గుడ్లు అందిస్తున్నారు. వాటిని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉడికించి ఇవ్వాలి. ఇంటికి ఇస్తుండటంతో పిల్ల లకు సరిగా అందడం లేదన్న వాదనలున్నాయి.

పర్యవేక్షణ లేక.. ఫలితాలు రాక

గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్, బాలామృతం, ఆరోగ్యలక్ష్మి, హెల్త్ చెకప్ తదితర ప్రాజెక్టులు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోనే ఉంటాయి. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి చిన్నారులకు ఐదేళ్లు నిండే వరకు ఆయా కేంద్రాల ద్వారా వారికి పోషకాహారం అందుతుంది. అలాగే, వారి ఆరోగ్య సంరక్షణ బాధ్యత కూడా అంగన్‌వాడీ సెంటర్లదే. అయితే, పర్యవేక్షణ లేకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదన్న చర్చ జరుగుతోంది.

ప్రధాన కారణాలివే..

బాల్య వివాహాలు, పేదరికం, అనారోగ్యం, అవగాహన లేమితో సమస్యలు ఉత్పన్నవుతున్నా యి. చిన్న వయసులోనే గర్భం దాల్చిన ఆడవాళ్లు నెలలు నిండకుండానే ప్రసవిస్తున్నారు. అటువంటి పిల్లలకు పుట్టుకనుంచే అనేక రుగ్మతలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం వారే తినేలా చూడాలి. పోషకాహార లోపంతో కలిగే ఇబ్బందులపై గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించాలి. ఐసీడీఎస్ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తేనే ఇది సాధ్యమవుతుంది.

వారోత్సవాలతో ప్రయోజనమేది?

గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని, వారిలో చైతన్యం తెచ్చేలా ప్రభుత్వం ఏటా పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తోంది. అయినా, ప్రయోజనం లేకుండా పోతోంది. ఆయా జిల్లాల సంక్షేమ శాఖ అధికారులను వివరణ కోరగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.



పరిష్కార మార్గాలు..

- సంతులిత ఆహారమైన ప్రొటీన్, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, ఖనిజాలు ఉన్న ఆహారం తీసుకోవాలి.
- పాల ఉత్పత్తులు, గుడ్లు, మాంసం, కూరగాయలు, పండ్లు తీసుకోవాలి.
- తల్లిదండ్రులకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకోవాలి.
- పిల్లలు బరువు తక్కువగా ఉంటే వైద్యుల సలహాలు పాటించాలి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	కరీంనగర్	సిరిసిల్ల	జగిత్యాల	పెద్దపల్లి
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	4	2	4	3
అంగన్‌వాడీ కేంద్రాలు	777	587	1,065	706
చిన్నారులు	19,989	34,261	64,420	35,044
తక్కువ బరువున్నవారు	1,830	147	196	317
నిర్దేశిత ఎత్తులేని పిల్లలు	8,963	811	150	208
ఎత్తుకు తగ్గ బరువు లేనివారు	5,630	68	173	898

యువత కోసం మెగా జాబ్‌మేళా

- 50 కంపెనీల ఆధ్వర్యంలో..
- రెండు వేలకుపైగా ఉద్యోగ అవకాశాలు
- ఎస్పీ అశోక్‌కుమార్ వెల్లడి



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

జగిత్యాలక్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వచ్చేనెల 11న మెగా ఎస్పీ కార్యాలయం ఆవరణలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. సుమారు 50 కంపెనీలతో రెండు వేలకు పైగా ఉద్యోగ అవకాశాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. 11న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కార్యక్రమం కొనసాగుతుందని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూల అనంతరం నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. యువత క్యూఆర్ కోడ్ ద్వారా పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, రాములు, ఆర్‌ఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నేర విచారణ సమర్థవంతంగా చేపట్టాలి

వివిధ కేసుల్లో నేర విచారణను సమర్థవంతంగా చేపట్టాలని, పెండింగ్ కేసులు తగ్గించాలని ఎస్పీ అన్నారు. పోలీసు అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. జిల్లా సరిహద్దుల నుంచి గంజాయి సరఫరా కాకుండా చూడాలని, కీలక వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు చేపట్టాలన్నారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఎస్బీ, ఐటీ కోర్ సీఐలు ఆరిఫ్ అలీఖాన్, రఫీక్ ఖాన్, రాంనరసింహారెడ్డి, రవి, నిరంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేస్తాం

- బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ యూకే అధ్యక్షుడు నవీన్‌రెడ్డి



మాట్లాడుతున్న నవీన్‌రెడ్డి

రాయికల్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ యూకే అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎంగా కేసీఆర్‌ను చూడటమే లక్ష్యంగా ఎన్‌ఆర్‌ఐ యూకే సభ్యులంతా కష్టపడి పనిచేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా వివరిస్తామని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎన్‌ఆర్‌ఐ వ్యవస్థాపక అధ్యక్షుడు కూర్మాచలం అనిల్, కో–ఆర్డినేటర్ మహేశ్ బింగాల, మాజీ అధ్యక్షుడు అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- సన్నాలకు రూ.500 బోనస్ జమ చేయాలి
- రైతులకు ఇబ్బంది రానీయొద్దు
- కలెక్టర్ సత్యప్రసాద్



కుస్తాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని కుస్తాపూర్, ముత్యంపేటలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని, కేంద్రాల వద్ద రైతులకు వసతులు కల్పించాలని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ట్యాబ్‌లలో డాటా ఎంట్రీ వేగవంతం చేయాలని, సన్నం రకం ధాన్యానికి రూ.500 బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో రఘువరన్, డీసీవో మనోజ్‌కుమార్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీర్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం దేవరాజ్, సీసీలు స్రవంతి, రాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రోజువారీ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, వంటశాల, స్టోర్‌రూంను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లను శానిటేషన్ చేయించాలని సూచించారు. ప్రహరీ నిర్మాణం, మెయిన్‌గేట్ నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్డీవోను ఆదేశించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆకునూరి అశ్విత, భూపతి అవంతిక, తుమ్మ హర్షవర్ధన్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్‌పెల్లిలో వారం క్రితం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జావెలిన్ త్రో, 600మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలలో ప్రదర్శన కన బర్చారని సంఘం ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం అస్ఫాక్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

క్యారంలో రజనీకి ప్రథమ బహుమతి


రజనీకి బహుమతి అందిస్తున్న అధికారులు

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కార్యాలయం ఉద్యోగి, వికలాంగురాలు బి.రజనీ రాష్ట్రస్థాయి క్యారం పోటీల్లో మొదటి బహుమతి సాధించింది. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వికలాంగుల క్రీడల్లో ఆమె మొదటి బహుమతి గెలుచుకుంది. రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ నుంచి బహుమతి అందుకుంది.

పోచమ్మ బోనాల్లో అపశృతి

- గుండెపోటుతో వ్యక్తి మృతి


గంగాధర్ (ఫైల్)

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో గురువారం నిర్వహించిన పోచమ్మతల్లి బోనాల్లో అపశృతి చోటుచేసుకుంది. గ్రామస్తులు పోచమ్మతల్లికి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తుండగా బోదనపు గంగాధర్ (60) గుండెపోటుతో అక్కడికక్కడే మృతిచెందాడు. శోభాయాత్ర నిర్వహిస్తుండగా గంగాధర్‌కు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో స్థానికులు ప్రథమ చికిత్స చేసినా ఫలితం లేకుండాపోయింది. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

స్వగ్రామానికి చేరిన వలసజీవి మృతదేహం


సురేశ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): భూషణరావుపేటకు చెందిన దీకొండ సురేశ్ (38) సౌదీఅరేబియాలో ఈనెల 16న గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. అప్పు చేసి గల్ఫ్ బాట పట్టగా.. అప్పులు తీరక ముందే సురేశ్ మృత్యువాత పడటంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. సురేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వామ్మో చలి..

- జిల్లాలో పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- 10.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు
- బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్న జనం
- వాతావరణ మార్పులే కారణమంటున్న శాస్త్రవేత్తలు



జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో చలి భయపెడుతోంది. ఈ యేడు అధిక వర్షాలు కురవడం.. భూగర్భజలాలు పైపైనే ఉండటంతో భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండి చలిగాలులు వీస్తున్నాయి.

ఈ ఏడాది అధికం

గతేడాది చలికాలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యాయి. కానీ ఈ ఏడాది ఇప్పుడే 10 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. ఉదయం, సాయంత్రం చలి పంజా విసురుతోంది. దీంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గోదావరి తీర ప్రాంతాలు, అటవీ ప్రాంతాలైన మల్లాపూర్, ధర్మపురి, సారంగాపూర్ మండలాల్లో ఎన్నడూ లేనంతగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొలాస వాతావరణ శాస్త్రవేత్తల ప్రకారం రానున్న ఐదు రోజుల్లో వాతావరణం పొడిగా ఉండటంతోపాటు గరిష్ట ఉష్ణోగ్రతలు 28 నుంచి 29 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ట ఉష్ణోగ్రతలు 15 నుంచి 17 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి

శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు ఉదయం, సాయంత్రం వేళల్లో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వాయు కాలుష్యం అధికమవుతున్న నేపథ్యంలో బయటకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలంటున్నారు. వాహనాలపై వెళ్తున్న వారు స్వెట్టర్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

మల్లాపూర్ మండల కేంద్రంలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రత 10.7 డిగ్రీల సెల్సియస్‌గా.. రాఘవపేటలో 10.8, భీమారం మండలం గోవిందారంలో 10.9, మన్నెగూడెంలో 11.2, ఎండపల్లి మండలం గుల్లకోటలో 11.2, కథలాపూర్‌లో 11.3, మెట్‌పల్లిలో 11.6, పెగడపల్లిలో 11.7, ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, మల్యాల మండలం మద్దుట్ల, సారంగపూర్‌లో 11.8, ధర్మపురి మండలం నేరెళ్ల, మేడిపల్లి, రాయికల్, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 11.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

చలి తీవ్రత పెరిగే అవకాశం

జిల్లాలో మరికొద్ది రోజుల పాటు చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు అక్కడక్కడ తగ్గుతుండటం, వరి నారు మళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు అదే స్థాయిలోనే ఉండే అవకాశం ఉంది.

– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్


ఇబ్రహీంపట్నంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు


మేడిపల్లిలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అధికారులు

మధ్యాహ్న భోజనం పరిశీలించిన అధికారులు

మెట్‌పల్లిరూరల్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో తహసీల్దార్ శ్రీనివాస్, మేడిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహ్మద్, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆర్ఐ ఉమేశ్ గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన నాణ్యత ఎలా ఉంది..? పరిశుభ్రత పాటిస్తున్నారా..? లేదా అని గమనించడంతోపాటు పలు విషయాలపై నిర్వహకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

పెగడపల్లి: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్.లత నిర్వాహకులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వంటగది, వంట సామగ్రిని పరిశీలించారు. నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యత లేకుంటే చర్యలు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు.ఎర్దండి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మోడల్ స్కూల్‌లో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్సీ హాస్టల్‌లో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ భోజనాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలు, హాస్టళ్లలో మధ్యాహ్న భోజనం తనిఖీలకు అధికారులను నియమించారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు గురువారం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. కీమనాయక్‌తండా, రేచపల్లిలో సారంగాపూర్ ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో శశికుమార్‌రెడ్డి, సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ జమీర్, ఎంఈవో కిషోర్, ఆర్ఐ భాస్కర్‌రావు, బీర్‌పూర్‌లో ఎంపీడీవో లచ్చాలు, కొల్వాయిలో బీర్‌పూర్ తహసీల్దార్ ముంతాజొద్దీన్, తుంగూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో నాగభూషణం, ఆర్ఐ శ్రీనివాస్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యత పరిశీలించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జగిత్యాల: జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ ఓల్డ్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

జగన్నాథపూర్ గ్రామంలో..

రాయికల్: జగన్నాథపూర్ గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం తహసీల్దార్ ఖయ్యూం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కౌన్సిలర్ మ్యాకల అనురాధ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.


బీర్‌పూర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో లచ్చాలు


పెగడపల్లిలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ రాంమోహన్

గిరిజన ఆశ్రమ పాఠశాలలో అందరూ కాంట్రాక్టు ఉపాధ్యాయులే..


జగన్నాథపూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాల


పిల్లలకు బోధిస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

- హెచ్‌ఎం, వార్డెన్ ఇన్‌చార్జులే..

రాయికల్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన జగన్నాథపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే వారంతా కాంట్రాక్ట్ ప్రతిపాదికన విధులు నిర్వర్తిస్తున్నవారే. విశేషమేమంటే ప్రధానోపాధ్యాయుడు కూడా ఇన్‌చార్జినే. దీంతో పాఠశాలను పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 8వరకు తరగతులు ఉన్నాయి. 50మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం రెగ్యులర్ ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదు. కాంట్రాక్ట్ పద్ధతిన ఐదుగురు ఉపాధ్యాయులతో నెట్టుకొస్తోంది. బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెంకు చెందిన శ్రీనివాస్‌ను ఈ ఆశ్రమ పాఠశాలకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా నియమించారు. ఈ విషయంపై జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సాయిబాబాను ‘సాక్షి’ సంప్రదించగా.. త్వరలో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమిస్తుందని తెలిపారు.

మాస్టర్‌ప్లాన్‌కు తగ్గట్లు నిర్మాణాలు చేపట్టాలి

జగిత్యాల: మాస్టర్ ప్లాన్‌కు తగ్గట్లు నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం పలు కాలనీల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. డ్రెయినేజీలను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో ఇష్టానుసారంగా నిర్మాణాలతో డ్రెయినేజీలు కనుమరగయ్యాయని తెలిపారు. పారిశుధ్యం, పచ్చదనంలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని, చెత్తబండికి తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని పేర్కొన్నారు. సంఘ భవనాలు, పాఠశాలలు, రోడ్లు, డ్రెయినేజీలకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని, వాటితో నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్ మల్లవ్వ, గోపి పాల్గొన్నారు.


డ్రెయినేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటాం

గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 8 మంది కార్మికులు గల్ఫ్‌లో మరణించగా వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.40 లక్షల విలువైన ప్రొసీడింగ్‌లను అందించారు. పట్టణంలోని ఉప్పరిపేటకు చెందిన మానుక మహేశ్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతుండగా సీఎం సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల చెక్కును అందించారు. ముప్పాల రాంచందర్‌రావు, గోలి శ్రీనివాస్, రాజిరెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ: నలుగురికి తీవ్ర గాయాలు


నుజ్జునుజ్జయిన ఆటో


రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులు

వెల్గటూర్ : కారు, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన నలుగురు యువకులు కిషన్‌రావుపేట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. స్తంభంపల్లి శివారులోకి రాగా నే రాయపట్నం నుంచి వెల్గటూర్ వైపు ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జు నుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ఎగిరి చెల్లాచెదురుగా పడిపోయారు. కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

గుంతలు తప్పించబోయి ప్రమాదం

రోడ్డుపై ఉన్న గుంతలు తప్పించబోయి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఏడో నంబర్ రాష్ట్ర రహదారిపై గత శుక్రవారం స్తంభంపల్లి వద్దనే జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందిన ఘటన మరవక ముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. వెల్గటూర్ నుంచి రాయపట్నం మధ్య ఉన్న గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. గుంతల్లో పడి రెండేళ్లలో 20 మందికి పైగా మృతి చెందారు. సుమారు 30 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మరో బస్సు

- పలువురు ప్రయాణికులకు గాయాలు



తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ శివారులోని అల్గునూర్ మానేరు వంతెన సమీపంలో ఓ ఆర్టీసీ బస్సును మరో బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం కరీంనగర్ నుంచి జమ్మికుంట వెళ్తున్న బస్సును ప్రయాణికులకు టికెట్ ఇచ్చేందుకు డ్రైవర్ అల్గునూర్ వంతెనపై ఆపాడు. అదే సమయంలో కోహెడ వెళ్తున్న బస్సు వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లోని పలువురు మహిళలకు గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో అల్గునూర్ బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది.


ప్రమాదంలో ధ్వంసమైన బస్సులు

వేములవాడలో రోడ్డు విస్తరణకు కొలతలు

వేములవాడ: వేములవాడలోని మెయిన్‌రోడ్డు విస్తరణకు అధికారులు గురువారం కొలతలు వేస్తున్నారు. ఇటీవల రోడ్ల విస్తరణపై ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించడంతో మెయిన్‌రోడ్డుపై మరో సారి కొలతలు వేసేందుకు 16 మంది నాలుగు బృందాలుగా రంగంలోకి దిగారు. మెయిన్‌రోడ్డులోని ఇళ్లు, దుకాణాలకు మరోసారి అంచనా వేస్తున్నారు. గతంలో వేసిన అంచనాలను తిరిగి పునర్ పరిశీలిస్తూ, సదరు యజమాని వివరాలు, కొలతలు సరి చూస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్‌కుమార్, మధు, సర్వేయర్లు మధుసూదన్, చామంతి, ఏఈలు గోవింద్, నర్మద, మయూరి తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ ఏర్పాటుకు రుణాలు

- కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు

ఓదెల(పెద్దపల్లి): కరీంనగర్ డైయిరీ ద్వార రూ.440 కోట్ల ఆదాయం వచ్చిందని చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మడకలో పాలకేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని డెయిరీ ద్వారా రూ.440కోట్ల ఆదాయం వస్తే అందులో రైతులకు రూ.375కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు డెయిరీ దోహదపడుతుందన్నారు. రైతులు ఇంటింటా పాడిపరిశ్రమ ఏర్పాటు చేసుకునేందుకు డెయిరీ ద్వారా రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకుడు గుడిపాటి కేశవరెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్, మేనేజర్, సిబ్బందిని సన్మానించి, మల్లికార్జునస్వామి మెమోంటోలు బహూకరించారు. డెయిరీ మేనేజర్ ముస్కు అంజారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ మధుకర్, బాపురావు, సూపర్‌వైజర్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.


పాలకేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

అనారోగ్యంతో పారిశుధ్య కార్మికుడి మృతి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుడు(ట్రాక్టర్ డ్రైవర్) దాసరం మురళి అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. నగరపాలిక అదనపు కమిషనర్ సువార్త ఆరెపల్లిలోని ఆయన ఇంటికి వెళ్లి, మృతదేహానికి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు.

వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని వ్యవసాయ బావిలో గురువారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డును బట్టి నందకిశోర్‌రాం, బిహార్ రాష్ట్రంలోని నార్సింగంజ్‌వాసిగా గుర్తించినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. అతని మృతికి గల కారణాలపై విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల: జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలిని లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. వేధింపులు భరించలేని ఉపాధ్యాయురాలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందే. విచారణ చేపట్టిన అధికారులు డీఈవోకు నివేదించారు. దీంతో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

ఉమ్మడి జిల్లా రైఫిల్ షూటింగ్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: క్రీడలు స్నేహబంధాలను పెంపొందిస్తాయని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రైఫిల్‌షూట్ పోటీలు విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందిస్తాయన్నారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి ఈనెల 30న హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ గన్‌ఫ్లోర్ గ్లోరీ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. హెచ్‌ఎం సురేంద్రప్రసాద్, పీఈటీ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్‌లో నకిలీ నోటు కలకలం


రూ.100 నకిలీ నోటు చూపుతున్న స్వామి

రాయికల్: పట్టణంలో దొంగ నోట్ల చలామణి జోరుగా సాగుతోంది. గురువారం పట్టణానికి చెందిన చికెన్ సెంటర్ యజమాని వాసం స్వామికి దొంగ నోటు వచ్చింది. ఆ నోటులోంచి వెలుతురుకు చూస్తే గాంధీ బొమ్మ కన్పించకపోవడంతో గమనించిన వాసం స్వామి దొంగ నోటుగా గుర్తించాడు. ఇటీవల కాలంలో పట్టణంలో రూ.500, రూ.100 దొంగనోట్ల చలామణి జోరుగా సాగుతోంది.

నేడు ‘కేశోరాం’లో దీపావళి బోనస్‌పై చర్చలు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికుల దీపావళి బోనస్‌పై శుక్రవారం కార్మిక సంఘానికి, యాజమాన్యానికి మధ్య అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో చర్చలు జరగనున్నాయి. గతేడాది కంటే అదనంగా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ కంపనీ కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు నెల రోజులుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న విధులు బహిష్కరించి, కంపనీ గేట్ ఎదుట నిరసన తెలిపారు. స్పందించిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యూసుఫ్ పర్మినెంట్ కార్మిక సంఘం నాయకులు, కంపనీ అధికారులను పిలిచి, విషయం తెలుసుకున్నారు. శుక్రవారం చర్చలకు ఆహ్వానించారు. దీంతో కార్మికుల్లో ఉత్కంఠ నెలకొంది. తమ డిమాండ్ మేరకు యాజమాన్యం బోనస్‌ను చెల్లిస్తుందా లేదా అని చర్చించుకుంటున్నారు.

పశుగ్రాసం, ట్రాక్టర్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న స్థానికులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని గంగారం గ్రామ పంచాయితీ పరిధి ఊశన్నపల్లె గ్రామంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పశుగ్రాసం, ట్రాక్టర్ దగ్ధమైంది. స్థానికుల వివరాలు.. గ్రామానికి చెందిన ముస్కు రాయమల్లు ట్రాక్టర్‌లో పశుగ్రాసం తరలిస్తుండగా ఈప్రమాదం జరిగింది. విద్యుత్ తీగలు కిందకు వేలాడి ఉండటం వల్లే షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం ప్రమాదానికి కారణమైందని బాధిత రైతు వాపోయాడు. ఈఘటనలో రూ.20 వేలు విలువ చేసే పశుగ్రాసంతోపాటు ట్రాక్టర్ టైర్లు కాలిబూడిదయ్యాయి.